వికలాంగులపై కార్పొరేట్ వెలుగు

'ఏమీ చేయలేం' అనుకుంటూ నిరాశ, నిస్పృహలతో జీవించే వికలాంగులకు కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు ఆసరాగా నిలుస్తున్నాయి. 'అన్నీ చేయగలరు' అంటూ వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు ఇటీవలి కాలంలో వికలాంగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయి. వికలాంగులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రయత్నిస్తున్నాయి.

నరేష్‌బాబు దీవి

హెచ్.ఆర్. హెడ్, Husys

కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగుల నేపథ్యం, అనుభవంలో మరింత వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. తద్వారా వికలాంగులకు కూడా కొన్ని ఉద్యోగాలు కల్పిస్తుండటం మంచి పరిణామం. స్వల్పంగా లేదా మధ్యస్తంగా వినికిడి, దృష్టిలోపాలు, ఇతర లోపాలున్నవారికి కార్పొరేట్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి. లోపాల తీవ్రతను, ఇతర సామర్థ్యాలను అంచనా వేసి, వికలాంగులకు ప్రత్యేకంగా నియామక పరీక్షలు నిర్వహించడానికి ఎన్.జి.ఒ.లు ప్రారంభమవుతున్నాయి.

ఐబీఎం లాంటి కంపెనీలు వికలాంగులు పనిచేయడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్‌లను తయారుచేస్తున్నాయి. వికలాంగుల కోసం ప్రత్యేకంగా ఐటీ క్యాంప్‌లను కూడా ఐబీఎం నిర్వహిస్తోంది. తద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపు వికలాంగులను ఆకర్షిస్తోంది. మైక్రోసాఫ్ట్ కూడా వికలాంగులకు తేలిగ్గా ఉండే విధంగా ఆపరేటింగ్ సిస్టమ్‌లను రూపొందిస్తుండటం విశేషం. టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ బీమా ఏజెంట్లుగా కొంతమంది వికలాంగులను నియమించుకుంది.

కంపెనీలకూ ప్రయోజనం

వికలాంగులను ఉద్యోగాల్లోకి తీసుకోవడం వల్ల కంపెనీలకు కూడా ప్రయోజనాలున్నాయి. వికలాంగుల్లో పని పట్ల నిబద్ధత, అంకితభావం ఎక్కువగా ఉంటుందని కంపెనీల అధ్యయనాలు చెబుతున్నాయి. ఉద్యోగుల ప్రొఫైల్‌లో భిన్నత్వం ఉంటే ఉత్పాదకత పెరుగుతుందని కంపెనీల విశ్వాసం. వికలాంగులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా సామాజిక సేవ చేస్తున్నామనే సంతృప్తి కూడా ఉంటుంది. ఇందులో భాగంగానే 'కార్పొరేట్ సామాజిక బాధ్యత' (సీఎస్ఆర్) విభాగాలను ఏర్పాటు చేసి వికలాంగులను ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి కార్పొరేట్ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి.

స్వచ్ఛంద సంస్థల కృషికి తోడుగా వికలాంగులకు కుటుంబం నుంచి ప్రోత్సాహం, ఆత్మవిశ్వాసం, మంచి చదువు అవసరం. స్వచ్ఛంద సంస్థలు అభ్యర్థులకున్న అర్హతలు, ఆసక్తులను బట్టి ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తాయి. లోపాల తీవ్రతను బట్టి కొంతమందికి అవకాశాలు తక్కువగా ఉండటం సహజం, ఉద్యోగం స్వభావం కూడా మారుతుంది. ఉదాహరణకు దృష్టి లోపం ఉన్న అభ్యర్థులకు వినడం, మాట్లాడటం ద్వారా చేసే బాధ్యతలు ఎక్కువగా అప్పగిస్తారు.

తమకున్న వైకల్యాన్ని బట్టి వికలాంగులు కింది ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు...

- ● **దృష్టిలోపం ఉన్నవారు...** లా, బోధన, సాఫ్ట్‌వేర్, హెచ్.ఆర్. మేనేజ్‌మెంట్, టెలీమార్కెటింగ్ మొదలైనవి.
- ● **మాట్లాడలేనివారు...** సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఐటీఈఎస్ (నాన్ వాయిస్), అడ్మినిస్ట్రేషన్ సంబంధిత ఉద్యోగాలు
- ● **వినికిడి లోపం ఉన్న అభ్యర్థులు...** సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఐటీఈఎస్ (నాన్ వాయిస్), బోధన
- ● **మానసిక వికలాంగులు...** కుట్టుపని, చేతివృత్తులు, కళలు, సపోర్ట్ ఉద్యోగాలు

శిక్షణ సంస్థలు

వికలాంగులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి మనదేశంలో అనేక స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. వాటిలో కొన్ని...

- ● EnAble India అనే సంస్థ బెంగళూరు కేంద్రంగా అనేక ఇతర ఎన్‌జీఓలతో కలిసి ఈ రంగంలో పనిచేస్తోంది. వికలాంగులను ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి ఆసక్తి ఉన్న కంపెనీలను గుర్తించడం, వాటిలో అవకాశాలు కల్పించడానికి ఈ సంస్థ కృషి చేస్తోంది. కంపెనీలకు అవసరమైన రీతిలో వికలాంగులకు ఈ సంస్థ శిక్షణ ఇస్తుంది. వివరాలకు... www.enable-india.org. ఫోన్: 08041101390. ఇ-మెయిల్: id-enableindia@gmail.com.
- ● శారీరక వైకల్యం, వినికిడిలోపాలున్న అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి Association of People with Disability (APD) అనే సంస్థ పనిచేస్తోంది.
- ● Deeds అనే సంస్థ కూడా వినికిడి లోపాలు ఉన్నవారికి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది.
- ● దృష్టి లోపం ఉన్నవారికి National Association for the Blind (NAB), మానసిక వికలాంగుల కోసం Fame India సంస్థలు కృషి చేస్తున్నాయి.

అన్ని ఉద్యోగాలూ...

- శాంతి రాఘవన్, EnAble India

వికలాంగులు అన్ని రకాల ఉద్యోగాలు చేయగలరు. దృష్టిలోపం ఉన్నా సరే... హెచ్.ఆర్. ఎగ్జిక్యూటివ్, సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్, టెక్నికల్, హెల్ప్ డెస్క్, ఎగ్జిక్యూటివ్, సర్వీస్ కోఆర్డినేటర్, ట్రాన్స్‌పోర్ట్ కోఆర్డినేటర్, అడ్మినిస్ట్రేషన్ కోఆర్డినేటర్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, నాన్‌వాయిస్ ఎగ్జిక్యూటివ్, రీసెర్చ్ ఎనలిస్ట్, వాయిస్, యాక్సెంట్ ట్రైనర్, కంప్యూటర్ ట్రైనర్, తదితర ఎన్నో రకాల ఉద్యోగాలు చేయవచ్చు. దృష్టిలోపం ఉన్నవారికి ప్రధాన అవరోధం... పేపర్. పేపర్ కాకుండా, సాఫ్ట్ కాపీలతో చేసే ఏ ఉద్యోగమైనా సరే ఎవరికీ తీసిపోని రీతిలో చేయగలరు.

శారీరక వికలాంగులకు పనిచేసే ప్రదేశం ఒక్కటే కొంచెం అవరోధంగా ఉంటుంది. లిఫ్ట్‌లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తే వీళ్లు కూడా ఇతరుల్లాగే అన్ని ఉద్యోగాలు చేయగలరు. మానసిక వికలాంగులను... వారికున్న లోపం తీవ్రతను బట్టి ప్రత్యేక ఉద్యోగాల్లోకి తీసుకోవచ్చు. ఉదాహరణకు మా సంస్థ ద్వారా మానసిక వికలాంగులు కొందరు బీపీఓల్లో నాన్-వాయిస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. డేటా ఎంట్రీ, హౌస్ కీపింగ్ ఎగ్జిక్యూటివ్‌లుగా కూడా చేయవచ్చు. స్వయం ఉపాధి పొందే శిక్షణ కూడా తీసుకోవచ్చు.

వికలాంగులను ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి చాలా కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. కానీ వారికి ఎలాంటి అవకాశాలు ఇవ్వాలి, ఇతరులతో సమానంగా వికలాంగులు ఎలా పనిచేస్తారు అనే అంశాల్లో కంపెనీలకు అవగాహన ఉండటం లేదు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు ఎలాంటి అవరోధాలు లేని, అందరితో కలిసిపోయే పని వాతావరణాన్ని వికలాంగులకు కల్పిస్తున్నాయి. JAWS, OCR లాంటి సాఫ్ట్‌వేర్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి.

పనితీరు ఆధారంగానే...

- డాక్టర్ నీతి శర్మ, Sakshum ఎన్.జి.ఒ.

ఇతర ఉద్యోగుల మాదిరిగా వికలాంగులు పనిచేయలేరనుకోవడం పొరపాటు. అవకాశం ఇచ్చి చూస్తే వారి శక్తి సామర్థ్యాలేమిటో తప్పకుండా నిరూపిస్తారు. వికలాంగులకు వారి లోపం ఆధారంగా కాకుండా, సామర్థ్యాలు, పనితీరు ఆధారంగానే కంపెనీలు అవకాశాలు కల్పించవచ్చు. ఇతర ఎన్‌జీఓల సహకారంతో మా సంస్థ వికలాంగులకు ప్రీ-రిక్రూట్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తుంది. నియామకం తర్వాత సంబంధిత పనికి అవసరమైన శిక్షణ ఇస్తాం. సాఫ్ట్‌స్కిల్స్, లాంగ్వేజ్‌లో కూడా శిక్షణ ఇస్తాం. వికలాంగులకు ఉద్యోగావకాశాలు కల్పించేటప్పుడు కంపెనీలు అనేక అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. వికలాంగులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటుచేయాలి. పని వాతావరణం ప్రోత్సాహకరంగా ఉండాలి. వైద్యం, భోజనం, పిల్లల సంరక్షణ, బయటకు వెళ్లడం, తదితర అంశాల్లో కంపెనీ, తోటి ఉద్యోగుల సహకారం కూడా వికలాంగులకు అవసరం. వికలాంగులను ఉద్యోగాల్లోకి తీసుకోబోయే ముందు వారి అవసరాలు, సామర్థ్యాల గురించి ఇతర ఉద్యోగులకు అవగాహన కల్పించాలి.

● వికలాంగులను పర్యవేక్షించే ఉన్నత స్థాయి ఉద్యోగులు ఫోన్, ఇతర మాధ్యమాల ద్వారా వారితో తరచుగా సంప్రదింపులు నిర్వహించాలి. తోటి ఉద్యోగులు కూడా ఇలా చేస్తే మంచిది. ● పనివేళలు, ప్రయాణాల విషయంలో పట్టువిడుపులు అవసరం. అవసరమైతే పార్ట్‌టైమ్ లేదా ఇంటి నుంచే పనిచేసే అవకాశం కూడా కల్పించాలి. ● పనిలో ఎలాంటి అవరోధాలు ఎదురుకాకుండా చూడాలి. విధి నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఆఫీసు గదికి దగ్గరలో పార్కింగ్, చక్రాల కుర్చీల్లాంటివి ఏర్పాటు చేస్తే మంచిది. ● వికలాంగులకు విధి నిర్వహణలో తేలిగ్గా ఉండే కొత్త సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులోకి వస్తే వాటిని ఏర్పాటుచేయాలి.

ఇతర సామర్థ్యాల్లో బెస్ట్!

- చేతన సూరపనేని; అసోసియేట్ హెచ్.ఆర్.

నేను ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేశాను. హెచ్.ఆర్. అసోసియేట్‌గా రిక్రూట్‌మెంట్, కౌన్సెలింగ్, ట్రైనింగ్ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నాను. దృష్టి లోపం ఉన్నందువల్ల కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యం ఉన్న బాధ్యతలు ఎక్కువగా నిర్వర్తిస్తున్నాను. దృష్టిలోపం ఉన్నవారికి ఇతర సామర్థ్యాలు అధికంగా ఉంటాయి. చేస్తున్న పని మీద చాలా శ్రద్ధ పెడతారు. వినికిడి శక్తి అధికంగా ఉంటుంది. జ్ఞాపకశక్తి కూడా ఎక్కువగా ఉంటుంది. దృష్టిలోపం ఉన్న అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఇతరులతో పోటీపడేటప్పుడు ఈ సామర్థ్యాలు వారికి అనుకూల అంశాలుగా పనిచేస్తాయి. 'హుస్యాసిస్'లో ఉద్యోగం లభించగానే చాలా ఆత్మవిశ్వాసం ఏర్పడింది. ఇతరుల మీద ఆధారపడకుండా, ఉద్యోగం చేస్తున్నాననే భావనే మరింత కష్టపడటానికి, నా సామర్థ్యాలను నిరూపించుకోవడానికి నిరంతరం ప్రేరణ ఇస్తుంది. దృష్టిలోపం వల్ల ఉద్యోగం రానప్పుడు 'నేను చేయలేను' అనుకునేదాన్ని. అవకాశం లభించగానే 'నేను చేయగలనా' అనే సందేహం ఉండేది. కొన్నాళ్లు ఉద్యోగం చేశాక 'నేను చేయగలను' అనే ఆత్మవిశ్వాసం ఏర్పడింది. ఉద్యోగం చేయాలనుకునే వికలాంగులందరూ ఇలాంటి దశలు అధిగమిస్తారు. ఉద్యోగం చేస్తున్నామనే భావనే వికలాంగులు శక్తివంచన లేకుండా పని చేయడానికి ప్రేరేపిస్తుంది. వికలాంగులు... తమకున్న లోపాల గురించి ఆలోచిస్తూ కుంగిపోకుండా, ఇతర సామర్థ్యాలను, బలాలను ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తే తప్పకుండా ఫలితం ఉంటుంది.

లక్ష్యసాధనకు అవరోధం కాదు!

- రాఘవేంద్ర సతీష్ పి; హెచ్.ఆర్. కన్సల్టెంట్

నాకు 60 శాతం దృష్టి లోపం ఉంది. బీ.కాం. పూర్తిచేశాను, ఇప్పుడు ఎంబీఏ చేయాలనుకుంటున్నాను. దృష్టి లోపం గలవారికి ఉద్యోగంలో ఉపయోగపడే JAWS (Job Access With Speech) సాఫ్ట్‌వేర్ నేర్చుకున్నాను. 'ఎనేబుల్ ఇండియా'లో శిక్షణ తీసుకున్నాను. శిక్షణ పూర్తయిన వెంటనే పీపుల్ ఈక్విటీ అనే కంపెనీలో హెచ్.ఆర్. కన్సల్టెంట్‌గా ఉద్యోగం లభించింది. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇందులో బిజినెస్ డెవలప్‌మెంట్, కార్పొరేట్ బ్రాండింగ్, రిక్రూటింగ్ విభాగాలకు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. కంపెనీలో ఇతర సహచరుల మాదిరిగానే అన్ని పనులు చేయడానికి నేనూ పోటీపడతాను. నాకు అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను కంపెనీ అందిస్తోంది.

ఉద్యోగంతోపాటు నేను వెబ్ డిజైనింగ్, వెబ్ డెవలప్‌మెంట్ చేస్తుంటాను. స్నేహితులతో కలిసి కొన్ని వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నాను. సెర్చ్ ఇంజిన్లకు సంబంధించిన సేవలు కూడా అందిస్తున్నాను. నేను కావాలనుకున్నది సాధించడంలో నాకు దృష్టి లోపం ఎప్పుడూ అవరోధం కాలేదు.